నమస్తే తెలంగాణ

# పెద్దపల్లి

5 | కరీంనగర్, మంగళవారం 20 ఆగస్టు 2024 | PEDDAPALLI

## నేను కాంగ్రెస్ వాదినే.. రేవంత్ రెడ్డి తప్పు చేస్తుండు..



నేను పదిహేనేండ్ల పోరనప్పటి సంది కాంగ్రెస్ వాదినే. ఇపుడు నా వయస్సు 80 ఏండ్లు. నా ఓటు ఇప్పటికీ కాంగ్రెస్‌కే. రేపైనా కాంగ్రెస్‌కే ఏత్త. రుణమాఫీ విషయంల మాత్రం నా కడుపు మండిపోతంది. రాజశేఖర్ రెడ్డి మాఫీ చేసినపుడు గిన్ని గొల్లాలు ఉండెనా? ఇప్పుడు ఒకటుంటే ఒకటి లేదని రైతులను తిప్పల వెడ్తున్నరు. నేనెవలకు భయపడెటోన్నిగాదు. రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క అసొంటోళ్లు పార్టీలకు వస్తుంటరు పోతుంటరు. వీళ్లు మంచిగ చేస్తలేరని నేను పార్టీ మీద అలిగెటోన్నిగాదు. ఇడ్సెటోన్నిగాదు. రుణమాఫీల రైతులకు న్యాయం జరుగుతలేదని అంటున్న. ఎవలచ్చినా ఇదే మాట చెప్త. నాకేం భయంగాదు. చిగురుమామిడి ఇండియన్ బ్యాంకుల నా పేరు మీద ₹1.80 లక్షలు, నా భార్య పేరు మీద ₹60 వేల అప్పున్నది. అప్పు తీసుకుంటున్నం. కడ్తున్నం. ఇపుడు బ్యాంకుల ఉన్న ₹2.40 లక్షలు మాఫీ కాదట! మీది పైసలు కట్టుండ్రని మంత్రులు చెప్తున్నరు. బ్యాంకులకు పోతే తీసుకోమంటున్నరు. ఇగ వాళ్లేందయ్యా ఇచ్చేది తోకమట్ట. రైతులకు ₹2లక్షల రుణమాఫీ చేస్తమని ప్రతి మీటింగ్‌ల చెప్పితే నమ్మి రైతులు ఓట్లేసిన్రు. నువ్వు (రేవంత్ రెడ్డి) ₹2 లక్షలు మాఫీ చేసెటోనివా.. ముందుగాల మమ్ములను మీది పైసలు కట్టుకొమ్మని చెప్పెటోనివా.. రేవంత్ రెడ్డి తప్పు చేస్తున్నవ్. రైతులు చానా బాధలు పడుతున్నరు. రైతుల గోస వంచుకునుడు మంచిదిగాదు. ఈ గొల్లాలన్నీ తీసేసి ₹2 లక్షలు బాకీ ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ అయ్యేలా చూడు.

**- వెల్మరెడ్డి మల్లారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ కార్యకర్త**

# మాఫీ చేయకుంటే రణమే



చిగురుమామిడి మండలం సీతారాంపూర్‌లోని హన్మాన్ దేవాలయంలో సీఎం రేవంత్ రెడ్డి మనసు మార్చాలని కోరుతూ మొక్కుతున్న రైతులు

**ఫీల్డ్ విజిట్ FIELD VISIT**

- మమ్మల్ని ముంచితే సర్కారుపై కొట్లాటే
- మా ఊరిలో 25 శాతం మందికే మాఫీ
- మిగతావి ఎగ్గొడితే ఊరుకోం
- మా ఊరు నుంచే అగ్గిపుట్టిస్తం
- పోరుబాటకు సిద్ధమవుతున్న సీతారాంపూర్ రైతాంగం
- 'నమస్తే తెలంగాణ' ఫీల్డ్ విజిట్‌లో ఐక్యగళం

'నమ్మించి ముంచుతరా..? ఆగస్టు 15లోగా ఏకకాలంలో ₹2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి అనేక కొర్రీలు పెట్టి ఎగ్గొడుతరా..? మా రైతులంటే అంత చులకనా..? ఇచ్చిన మాట ప్రకారం మాఫీ చేయకపోతే ఇక రణమే. ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకుంటం' అని చిగురుమామిడి మండలం సీతారాంపూర్ రైతాంగం అల్టిమేటం జారీ చేస్తున్నది. గ్రామంలో 260 మంది లోన్లు తీసుకుంటే అందులో 25 శాతం మంది లోన్లు మాఫీ చేసి, మిగిలినవారి నోట్లో మన్ను కొడుతమంటే ఊరుకునేది లేదని, సర్కారుపై పోరుకు తమ ఊరు నుంచే అగ్గిపుట్టిస్తమని స్పష్టం చేస్తున్నది. సోమవారం 'నమస్తే తెలంగాణ' బృందం ఫీల్డ్ విజిట్ చేయగా, రైతులంతా ఐక్యగళం వినిపించారు. తీవ్ర స్థాయిలో నిరసనలు చేపడతామని, అవసరమైతే వరుస ఆందోళనలకు దిగి సర్కారు మోసాన్ని ఎండగడతామని స్పష్టం చేశారు.

కరీంనగర్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ)/చిగురుమామిడి: మాటిచ్చి నమ్మించి రుణమాఫీ చేయకుండానే నిండా ముంచిన కాంగ్రెస్‌పై చిగురుమామిడి మండలం సీతారాంపూర్ కర్షకులు భగ్గుమంటున్నారు. రుణమాఫీ చేసే వరకు ఆందోళనలు చేపడతామని స్పష్టం చేస్తున్నారు. ఎన్నికల ముందు ₹2 లక్షలు మాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు అనేక కొర్రీలు పెట్టారని, తమ గ్రామంలో 75 శాతం మంది రైతులకు రుణమాఫీ కాకుండా చేశారని మండిపడుతున్నారు. తీసుకున్న రుణం ప్రతి సీజన్‌లో క్రమం తప్పకుండా వడ్డీ చెల్లించి రెన్యువల్ చేయించుకున్నా ఎంతో మంది రైతులకు ప్రభుత్వం అన్యాయం చేసిందని, నిజాయితీగా రుణం చెల్లించిన వారికే మాఫీ కాకుండా పోయిందని వాపోతున్నారు. తమ గ్రామంలో సుమారు 260 మంది రైతులు లోన్ తీసుకుంటే, 70 మంది కంటే తక్కువే రుణమాఫీ జరిగిందని చెబుతున్నారు. ఇప్పటికైనా తమ గ్రామానికి చెందిన అర్హులైన రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే రుణమాఫీ కోసం తమ గ్రామం నుంచే అగ్గిపుట్టిస్తామని, తీవ్ర స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని, అవసరమైతే వరుస ఆందోళనలకు దిగుతామని హెచ్చరిస్తున్నారు. సోమవారం గ్రామాన్ని సందర్శించిన 'నమస్తే తెలంగాణ' బృందం ఎదుట రైతులు తమ గోడును వెల్లబోసుకున్నారు. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి ఓట్లేశామని, ఇప్పుడు తమకు తీవ్రమైన అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ సానుభూతి పరులు, సీనియర్ నాయకులు కూడా రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విధించిన ఆంక్షలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న హుస్నాబాద్ నియోజకవర్గం పరిధిలోని ఈ గ్రామ రైతులు రుణమాఫీ కోసం ఎంత వరకైనా పోరాడతామని స్పష్టం చేస్తున్నారు. పూర్తి వివరాలు వారి మాటల్లోనే..

### రెన్యువల్ చేసుకునుడే పాపమైంది



నేను ఇరువై ఏండ్ల సంది క్రాప్ లోన్ తీసుకుని రెగ్యులర్‌గా కట్టుకుంటున్న. ఈ సారి నా లోన్ రెన్యువల్ చేసుకునుడు తప్పయ్యింది. బ్యాంకుల మోసం జరిగింది. 2023 డిసెంబర్ 8న నేను లోను కడ్తామని చిగురుమామిడి యూనియన్ బ్యాంక్‌కు పోయిన. ఇపుడు కట్టుకుంటే రుణమాఫీ వర్తిస్తదా అని బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్‌ను ముందుగాల్నే అడిగిన. నీది పాతలోనేనాయే వస్తదని చెప్పిండు. నమ్మి లెక్క చేయించిన. ₹1.60 లక్షలు తీసుకుంటే వడ్డీ పైసలు కలిపితే ₹1.74 లక్షలు అయినయని చెప్పిండు. అదే రోజు పైసలు కట్టి రెన్యువల్ చెయ్యమని చెప్పిన. నా ఖర్మగాలి మూడు రోజులైనంక మళ్ల నాకు ₹1.60 లక్షలు నా ఖాతాలకు కొట్టిండు. లక్ష 50 వేలు మాఫీ లిస్టుల నా పేరు రాలే. ఎందుకు రాలేదని ఏఓను అడిగితే బ్యాంకు నుంచి పైసలు కొట్టిన డేట్ చూసిండు. నువ్వు డిసెంబర్ 11న లోన్ తీసుకున్నట్టు ఉన్నది. డిసెంబర్ 9 వరకు తీసుకుంటెనే వర్తిస్తదని, ఇగ నీకు రాదని చెప్పిండు. ఇరువై ఏండ్ల సంది లోన్ తీసుకుంటున్న. టైంకు రెన్యువల్ చేపిచ్చుకుంటున్న. నాకెందుకు రాదు. లోను ఎగవెట్టెటోళ్లకు ఇస్తన్రు. నా అసొంటోనికి మోసం చేస్తన్రు. ఇది నా తప్పా. నా అసొంటి రైతులు ఇంకా మస్తు మంది ఉన్నరు. వాళ్ల పరిస్థితి ఏంది?

**- గంగుల శంభులింగం, రైతు**

### మా అమ్మది మాఫీ అయ్యింది.. బాపుది కాలే



చిగురుమామిడి యూనియన్ బ్యాంకుల మా అమ్మ పేరు మీద రూ.లక్ష, మా బాపు పేరు మీద ₹లక్ష అప్పున్నది. 2023 డిసెంబర్ 7న మా నాన్న జనార్దన్ రెడ్డి పేరిట ఉన్న ₹లక్ష కట్టిన. మరుసటి రోజు మా బాపు లోను రెన్యువల్ చేసేది ఉండె. వరుసగా సెలవులు వచ్చాయి. అదే నెల 15న లోన్ రెన్యువల్ చేసిన్రు. మా అమ్మ పేరుమీద ఉన్న లోన్ మాత్రం అట్లనే ఉంది. విచిత్రం ఏందంటే. ₹లక్ష లోపు మాఫీ లిస్టుల మా అమ్మ (విమల) పేరు వచ్చింది. మా బాపుది రాలే. మా లెక్క ఎప్పటికప్పుడు లోన్ కట్టుకున్నోళ్లకు ఇట్లనేనా అన్యాయం చేసేది. ఎగవెట్టుకుంట వచ్చినోళ్లకే మాఫీ వర్తిస్తంది. రుణమాఫీతోని రైతులకంటే బ్యాంకులకే ఎక్కువ లాభం అయితంది. మేమేమన్నా కొత్తగ లోన్ తీసుకుంటున్నమా. ఇరువై ముప్పై ఏండ్ల సంది తీసుకుంటున్నం. టైంకు కడ్తున్నం. రెన్యువల్ చేసుకుంటే కొత్త లోన్ కింద జమకడ్తరా..? ఇదేం పద్ధతి. పాత లోన్ నిజాయితీగా చెల్లించుడు సుత పాపమేనా..? ప్రభుత్వం చెప్పినట్లు 2018 డిసెంబర్ 12 నుంచి క్రాప్ లోన్ తీసుకున్న ప్రతి రైతుకు వర్తించాలే. 2023 డిసెంబర్ 9 తర్వాత కొత్త లోన్ తీసుకున్న వారికి ఇవ్వకున్నా పర్వాలేదు. కానీ పాత లోన్లు ఉన్న రైతులకు ఎందుకు అన్యాయం చేస్తున్రు.

**- గోలి వెంకటరెడ్డి, రైతు**

### కోపన కారటులేదని మాఫీ చేయలే..



చిగురుమామిడి బ్యాంకుల క్రాపులోను కింద ₹70 వేలు తీసుకున్న. నాకు కోపెన కారటు లేదని మాఫీ చేస్త లేరు. మా ఇంట్ల ఎవల పేరు మీద అప్పులేదు. నన్ను కరీనారంపో.. చిగురుమామిడికిపో అని చెప్తున్నరు. మా ఇంట్ల అయినోళ్లు లేరు. నేనొక్కదాన్ని ఏడికనిపోవాలె. కన్నారం పోతే కలెక్టరాఫీసు ఎక్కడుంటదో తెల్వదాయె. ఆడికివోయి అప్లికేషన్ పెట్టుకొమ్మంటే నేనెట్లపోవాలె. ఆడికి వోవాల్నని నిన్నామొన్నటి సందే అంటున్నరు. అంతకు ముందు నాకు తెల్వనే తెల్వది. అత్తె అచ్చే లేకుంటె లేదని ఒక్కసిత్తం చేసుకున్న. అప్పు నా బిడ్డ పెండ్లికి చేసిన్నా, కొడుకు పెండ్లికి చెసిన్నా. పంట మీదనేగదా చేసింది. పంట మీద తీసుకున్నరా.. లేదా అని చూసి మాఫీ చెయ్యలెగాని కోపెన కారట లేదని ఆపుడేంది. నేను కరీనారం పోను చిగుర్మామిడికివోను. ఇది చేసినోడెవడో నా దగ్గరికే రావాలే. వాళ్ల సంగతి చూడాలే.

**- అన్నమండ్ల రాజవ్వ, రైతు**

### మా ఊళ్లె 25 శాతం మందికే మాఫీ



రుణమాఫీ మీన ఒక్క అధికారితాన ఎట్ల మాఫీ చేత్తున్నరో వివరాల్లేవ్. అగ్రికల్చర్ ఆఫీసుకువోయి ఏదన్న డౌట్ అడిగితే మా సారును అడిగి చెప్తమంటరు. పెద్ద సార్లకు ఫోన్ చేసి అడిగితే అది మాకు తెల్వదంటరు. బ్యాంకులకు పోతే అగ్రికల్చరోళ్లను అడుగుమంటరు. అరె.. ఒక్కడు సక్కగ చెప్పిసావడు. సర్కారుతోపాటు సార్లు, బ్యాంకర్లు అందరూ కల్సి రైతులను ఆగం చేస్తున్నరు. ఇయ్యల్లగాదు.. నిన్నగాదు ఇరవై ఏండ్ల సంది బ్యాంకుల అప్పులు తీసుకుంటున్నం కడ్తున్నం. మా ఊళ్లె 95 శాతం మంది తీసుకున్నరు. అప్పు మల్ల జాగ్రత్తగ కట్టుకుంటరు. నేను గట్లనే చిగురుమామిడి యూనియన్ బ్యాంకుల ₹95 వేలు అప్పు తీసుకున్న. మొదటి లిస్టులనే పేరు వస్తదని ఎదురు చూసిన. అదీ వోయింది. వడ్డీ కలిపితే ఎక్కువైందేమోనని రెండో లిస్టుల వస్తదని ఆశపడ్డ. అండ్ల సుత రాలే. మూడో లిస్టు సుత ఉత్తదే అయ్యింది. రెగ్యులర్‌గా రెన్యువల్ చేసుకునెటోనికి నాకే ఎగనామం పెట్టిన్రు. ఇగ రుణమాఫీ ఎక్కడ సక్కగ నడుస్తున్నది. ఇదంతా పెద్ద డ్రామా, మా ఊళ్లె 25 శాతం మందికే రుణం మాఫీ అయ్యింది.

**- మహంకాళి కొంరయ్య, రైతు**

### రాహుల్ గాంధీ బాగ మాట్లాడెగదా..



బీఆర్‌ఎస్ ప్రభుత్వం మీద లేని పోనివి చెప్పి ఓట్లేసుకుని అధికారంలకు వచ్చిన్రు. వరంగల్ రైతు డిక్లరేషన్ సభల రాహుల్ గాంధీ ఏం మాట్లాడిండు. ₹2 లక్షల వరకు రైతులకు రుణమాఫీ చేస్తమని చెప్పిండు. ప్రతి కాంగ్రెస్ మీటింగుల ఇవే ముచ్చట్లు చెప్పితే నమ్మి ఓట్లేత్తిమి. ఇపుడు ఒక్క రుణమాఫీ కాన్నే గిన్ని కొర్రీలు వెట్టవట్టిరి. మున్ముందు ఇంకెంత గోసకున్నదో. రైతు భరోసా అనిరి అదీ కూడా ఇస్తలేరాయే. మా భార్య శ్రీదేవి పేరుమీద ₹2 లక్షల అప్పు సరిగ్గా గతేడాది డిసెంబర్ 8న రెన్యువల్ చేయించుకున్న. కానీ, ఇప్పుడు జాబితాల ఆమె పేరు లేదు. నిజాయితీగా ఉండేటోళ్లకు మీరిచ్చే ప్రతి ఫలం ఇదేనా..? రాహుల్ గాంధీ రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలే. ₹2 లక్షల వరకు రుణమాఫీ చేసి తీరాలి. లేదంటే రైతులు ఊరుకునేది లేదు.

**- సారబుడ్ల నారాయణ రెడ్డి, రైతు**

### ఇదేనా మార్పు? పుట్ట గతులుండయి..



ఎలక్షన్లపుడు కేసీఆర్ మీద లేనివి పోనివి చెప్పిన్రు. మార్పు రావాలె.. మార్పు రావాలె అంటే కొత్తగా ఏమస్తదో చూద్దామని ఓట్లేస్తిమి. కొత్తగ తెచ్చిన మార్పు ఇదేనా..? రైతులను గోసవుచ్చుకునుడేనా కొత్తగ తెచ్చిన మార్పు? కేసీఆర్ ఉన్నప్పటి పథకాలు అమలు చేస్త లేరు. కొత్త పథకాలన్నా తెస్తరా..? అంటే అవీ లేవు. మార్పు ఇగ ఎక్కడ కనిపిస్తంది? రైతులను గోస వెట్టుకునుడు తప్ప. నాకు ₹2.07 లక్షల అప్పు ఉన్నది. ₹7 వేలు ఎక్కువ ఉన్నవని మాఫీ కాలేదు. ఆనాడు ఎలక్షన్ల ఏం చెప్పిన్రు. ₹2 లక్షల వరకు రుణమాఫీ చేస్తమన్నట్టే ఇపుడు మాట మీద నిలబడాలె. ఎక్కువైన పైసలు మేం కట్టుకుంటం. మళ్ల లోన్ తీసుకుంటం. మాట మార్చితే పుట్ట గతులుండయి.

**- సందె నిర్మలా దేవి, రైతు**

### లోన్ మాఫీ చేస్తమంటె ఓట్లేస్తిమి..



ఓట్లపుడు రైతుల లోన్ మాఫీ చేస్తమని చెప్పితే అందరం నమ్మినం. ఓట్లేసినం. గెల్సిన్రు. ఐదేండ్లదాక ఇగ మాతోని ఏం పని. ఇపుడు మమ్ముల ఆటాడిస్తున్నరు. అపుడు మస్తు సంబురపడుకుంట ఓట్లేసినం. ఇపుడు ఏడుపు ఒక్కటే మిగిలింది. నా పేరు మీద చిగురుమామిడి బ్యాంకుల ₹లక్షా ముప్పయి వేలు, నా భర్త నందిరెడ్డి పేరు మీద ₹లక్షా ఇరవై వేలు అప్పున్నది. రొండు నెల్ల కిందనే కట్టి తెచ్చుకున్నం. ఇపుడు మాకు లోన్ మాఫీ కాదంటున్నరు. మొన్న బ్యాంకుకువోయి మీది యాభై వేలు కడ్తమంటే బ్యాంకుల అస్సలు తీసుకుంట లేరు. మీది కెళ్లి ఆడర్ రాలేదు ముట్టమంటే ముట్ట మంటున్నరు. మరి మాసొంటోళ్ల గతేంది? గిందుకేనా మాతోని ఓట్లేయించుకున్నది. రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలే.

**- ఒంటెల సరోజన, రైతు**

### ఇప్పుడేమో మోసం చెయ్యవట్టిరి



కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పే లెక్కలకు, ఆచరణలో జరిగే దానికి పొంతన కనిపిస్త లేదు. మొదట్ల ₹45 వేల కోట్లు మాఫీ చేస్తున్నమని చెప్పిన్రు. బడ్జెట్‌లో ₹26 కోట్లు పెట్టిన్రు. మొన్న వైరా సభలో సీఎం ఏం చెప్పిండు. ₹18 వేల కోట్ల రుణమాఫీ సంపూర్ణమైపోయిందని చెప్పిండా లేదా..? ₹45 వేల కోట్లెక్కడ? ₹18 వేల కోట్లు ఎక్కడ? మొదట్ల లెక్కలు చేసుకుని చివరికి రైతుల బొక్కల పొడ్సిన్రు. వచ్చిన రైతులు సుతం సంతోషంగా లేరు. అసలు మాత్రమే మాఫీ అయ్యింది. వడ్డీ చెల్లించాలని బ్యాంకోళ్లు ఒత్తిడి చేస్తున్నరు. అప్పుడేమో అసలు వడ్డీ అంతా చెల్లిస్తామనిరి. ఇప్పుడేమో ఇట్ల మోసం చెయ్యవట్టిరి. రుణమాఫీ విషయంల నాకు కూడా అన్యాయం జరిగింది. అందరి లెక్కనే నేను న్యాయం కోసం ఎదురు చూస్తున్న. రైతులను మోసం చేయవద్దనేది నా విజ్ఞప్తి.

**- ముస్కుల సుధాకర్ రెడ్డి, రైతు**

# రుణమాఫీ.. 2లక్షల మంది రైతులకు ధోఖా?



## మాఫీలో కాంగ్రెస్ ప్రభుత్వం మాయాజాలం

- ఏకకాలంలో అని చెప్పి మూడు విడుతల్లో అమలు
- లక్షలాది మంది అన్నదాతల పేర్లు గల్లంతు
- మొదటి రెండు విడుతల్లో రానివారిని ఏమాత్రం పరిగణలోకి తీసుకోని సర్కారు
- 2014 తో పోలిస్తే 1.39 లక్షల మందికి తగ్గిన మాఫీ
- వివరాల సేకరణ అంతా ఉత్తదేనంటున్న నిపుణులు
- ప్రభుత్వంపై మండిపడుతున్న కర్షకులు



'పేరు గొప్ప ఊరు దిబ్బ' అన్నట్టున్నది కాంగ్రెస్ రుణమాఫీ ప్రక్రియ తీరు! ఏకకాలంలో ₹రెండు లక్షల వరకు మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి గొప్పలకు పోయినా.. తీరా మాట మార్చి మూడు విడుతల్లో అమలు చేయడం, అందులోనూ అర్హులైన లక్షలాది మంది రైతుల పేర్లు గల్లంతుకావడం ధోఖా చేసిన తీరును బయటపెట్టింది. మొదటి విడుతలోనే వేలాది మంది అర్హులకు మాఫీ జరగలేదనే విషయం ఆధారాలతో సహా బయటకు వచ్చినా.. ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా మూడో విడుత చేసినట్టు ప్రకటించింది. లోతుగా చూస్తే ఈ మూడు విడుతల్లోనూ తన మాయాజాలాన్ని ప్రదర్శించి, సవాలక్ష కొర్రీలతో లక్షలాది మందిని పక్కన పెట్టింది. 2014లో ఆనాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం 3,77,984 మంది రైతులకు మాఫీ చేస్తే.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం 2,37,994 మందికే చేసింది. ఇక్కడే దాదాపు 1.39 లక్షల మంది తేడా కనిపిస్తున్నది. నిజానికి 2018 నుంచి 2023కు మధ్య ఉమ్మడి జిల్లాలో సాగు విస్తీర్ణమే కాదు రైతుల సంఖ్య కూడా భారీగా పెరిగింది. ఆ లెక్కన ఉమ్మడి జిల్లాలో సుమారు ఐదు లక్షలకుపైగా మందికి రుణమాఫీ జరగాల్సి ఉండగా.. దాదాపు రెండు లక్షలకుపైగా రైతులకు కాంగ్రెస్ సర్కారు ఎగనామం పెట్టినట్టు తెలుస్తున్నది.

కరీంనగర్, ఆగస్టు 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అంటే 2014లోనే లక్ష లోపు ఉన్న రైతులకు రుణమాఫీ చేసిన విషయం తెలిసిందే. మ్యానిఫెస్టోలో చెప్పినదానికి అనుగుణంగా అప్పటి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చర్యలు తీసుకున్నారు. ఆ ప్రకారంగా చూస్తే 2014లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం 3,77,984 మంది రైతులకు ₹1,693.52 కోట్ల రుణమాఫీ చేసింది. అలాగే రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత లక్ష రుణమాఫీ చేస్తామని ప్రకటించి దశల వారీగా అమలు చేసింది. రెండో సారి సైతం 3,73,213 మందికి ₹1,191 కోట్లు రుణ మాఫీచేసి మాట నిలబెట్టుకున్నది. 2016 అక్టోబర్ 11న కరీంనగర్ ఉమ్మడి జిల్లా నాలుగు జిల్లాలుగా ఏర్పడిన విషయం తెలిసిందే కాగా, అప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 57 మండలాలు ఉండేవి. జిల్లాల పునర్విభజనలో భాగంగా పది మండలాలు వరంగల్ సిద్దిపేట, భూపాల్‌పల్లి జిల్లాలో కలిశాయి. ఫలితంగా రైతుల సంఖ్య తగ్గడమే కాకుండా రుణ మాఫీ మొత్తం తగ్గింది. నిజానికి అప్పటికీ ఇప్పటికీ వ్యవసాయ పరిస్థితులు వేరుగా ఉండగా.. ప్రస్తుత ప్రభుత్వం మాత్రం రైతులను ధోఖా చేసినట్టు తెలుస్తున్నది.

### రెండు లక్షలపైగా రైతులకు ఎగనామం

ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మూడు విడుతల్లో కలిపి 2,37,994 మంది రైతులకు 1,788.77 కోట్ల రుణమాఫీ చేసినట్టు గణాంకాలు చెబుతున్నాయి. నిజానికి క్షేత్రస్థాయి పరిస్థితులకు, రుణమాఫీ జరిగిన తీరుకు మధ్య భారీ వ్యత్యాసం కనిపిస్తున్నది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు, వాటి ద్వారా వచ్చిన నీళ్లు, ముఖ్యంగా కాళేశ్వరం జలాల వంటి వాటి వల్ల 2018 నుంచి 2023 మధ్య సాగు పండుగలా సాగింది. వ్యవసాయం చేసే రైతుల సంఖ్య కూడా బాగా పెరిగింది. ఆ లెక్కన చూస్తే ఉమ్మడి జిల్లాలో దాదాపు 7.50 లక్షల మంది రైతులు ఉండగా.. బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతుల సంఖ్య ఐదు లక్షలపైగా ఉంటుందని పలు గణాంకాల ద్వారా స్పష్టమవుతున్నది. ఆ మేరకు దాదాపు ఐదు లక్షల మంది రైతులకు రుణమాఫీ జరగాల్సి ఉన్నది. కానీ, ప్రస్తుతం రుణమాఫీని చూస్తే.. సగం మందికి కూడా జరగలేదని తెలుస్తున్నది. ఒక్క కేడీసీసీబీ బ్యాంకు పరిధిలోనే సుమారు 40వేల మందికిపైగా రైతులకు రుణమాఫీ వర్తించలేదు. జాతీయ బ్యాంకుల సంగతి ఇక చెప్పనక్కర లేదు. అంతేకాదు, కొన్ని గ్రామాల్లో 40 నుంచి 45 శాతం రుణమాఫీ అయితే, కొన్ని గ్రామాల్లో 50 శాతం జరిగింది. వందకు వంద శాతం కాకపోయినా 90 శాతం జరిగిన గ్రామాలు కూడా ఇప్పటివరకు లేవు.

### ఏదీ స్పష్టత?

మొదటి విడుత రుణమాఫీ కాలేదని రైతుల నుంచి ఆందోళన వ్యక్తమైనప్పుడు, వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో రైతులు చాలా చోట్ల ఫిర్యాదులు చేశారు. వారి నుంచి స్పష్టత రాకపోవడంతో కలెక్టర్ కార్యాయాలకు వచ్చి ప్రజావాణిలో దరఖాస్తులు చేసుకున్నారు. అయినా పరిష్కారం మాత్రం దొరుకలేదు. మాఫీ కాని వారికి ఫలానా తేదీలోగా ఇస్తామని ముఖ్యమంత్రి నేటివరకు ఒక్క మాట చెప్పలేదు. దీంతో రైతులు రుణమాఫీ కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. అలాగే నేటికి ఏ ఒక్క అధికారికి ఈ విషయంపై స్పష్టత లేదు. ప్రభుత్వం నుంచి ఎటువంటి మార్గదర్శకాలు అధికారికంగా రాలేదు. దీంతో అధికారులు కూడా ఏమి సమాధానం చెప్పలేని పరిస్థితి.

**కాంగ్రెస్ ప్రభుత్వం మూడు విడుతల్లో ఆయా జిల్లాల వారీగా చేసిన రుణమాఫీ వివరాలు**

| | మొదటి విడుత | | రెండోవ విడుత | | మూడోవ విడుత | |
|---|---|---|---|---|---|---|
| జిల్లా పేరు | రైతులు | మాఫీ(రూ.కోట్లలో) | రైతులు | మాఫీ (రూ.కోట్లలో) | రైతులు | మాఫీ (రూ.కోట్లలో) |
| కరీంనగర్ | 38,894 | 201.46 | 19,894 | 182.44 | 12,034 | 152.65 |
| జగిత్యాల | 39,269 | 207.99 | 19,623 | 169.00 | 13,799 | 172.34 |
| పెద్దపల్లి | 29,724 | 149.42 | 13,401 | 124.41 | 8,268 | 101.75 |
| సిరిసిల్ల | 23,330 | 127.22 | 11,915 | 116.00 | 7.843 | 94.09 |
| మొత్తం | 1,31,217 | 686.09 | 64,833 | 591.85 | 41,944 | 510.83 |

# కుండపోత

- ఉమ్మడి జిల్లాలో అక్కడక్కడా జోరువాన
- జగిత్యాల, కోరుట్ల, వేములవాడలో లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఇళ్లలోకి వరద చేరడంతో అవస్థలు



కోరుట్ల: ప్రకాశం రోడ్డులో జలమయమైన రహదారి



జగిత్యాల: గంజ్ రోడ్డులో ఉప్పొంగుతున్న వరదనీరు

జగిత్యాల టౌన్/ కోరుట్ల/ వేములవాడ రూరల్, ఆగస్టు 19 : ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సోమవారం జోరువాన పడింది. మధ్యాహ్నం తర్వాత అక్కడక్కడా కుండపోత కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. జగిత్యాల, కోరుట్ల పట్టణాల్లోని పలు కాలనీలు నీటమునిగాయి. గల్లీ రోడ్లు కాలువలను తలపించాయి. ఇండ్లలోకి నీరు చేరడంతో కాలనీలవాసులు అవస్థలు పడాల్సి వచ్చింది. జగిత్యాలలో అత్యధికంగా 60.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, జగిత్యాల రూరల్ మండలం పొలాసలో 58.5, పెగడపల్లి మండలంలో 48.0, కోరుట్లలో 48.0, మెట్‌పల్లి మండలం జగ్గాసాగర్‌లో 46.3, రాయికల్ మండలం అల్లీపూర్‌లో 31.0 మిల్లీమీటర్ల వర్షం పడింది. జగిత్యాల జిల్లా కేంద్రంలో గంట పాటు భారీ వర్షం కురు వడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. పట్టణంలోని ధరూర్ క్యాంపు, హౌసింగ్ బోర్డు, తీన్‌ఖని, టవర్‌సర్కిల్, సారుగమ్మవీధి, మార్కండేయనగర్ ప్రాంతాల్లో రోడ్లన్నీ కాలువల్లా ఉప్పొంగాయి. రెండు గంటల పాటు రాకపోకలు స్తంభించిపోయాయి. కోరుట్లలో కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రకాశం రోడ్డు, ఝాన్సీరోడ్డు కాలనీ, ఆదర్శ నగర్, ముత్యాల వాడ, గోవిందగిరి కాలనీల్లో వరద నీరు చేరి మురుగు కాలువలపై నుంచి ప్రవహించింది. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం వట్టెంల, ఫాజుల్‌నగర్, నమిలిగుండుపల్లి, నూకలమర్రి తదితర గ్రామాల్లో వరద పోటెత్తింది. వట్టెంల గ్రామంలో ఇండ్లలోకి నీరు చేరింది. కరీంనగర్ జిల్లా కేంద్రంతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది.



వేములవాడ రూరల్: వట్టెంలలో ఇంట్లోకి చేరిన వర్షపు నీరు